
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

గురువారం 9 మే 2024



ఇంకా మూడు రోజులే!

చివరి అంకానికి చేరుకున్న ప్రచారం

- క్షేత్రస్థాయిలో నేతల విస్తృత ప్రచారాలు
- 10,11వ తేదీల్లో అగ్రనేతల రాక
- పట్టు కోసం ప్రధాన పార్టీల వ్యూహాలు
- క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నం

లోక్‌సభ ఎన్నికల ప్రచార గడువు ముగియ డానికి మూడు రోజులు మాత్రమే సమయం ఉండడంతో అన్ని ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. గడువు సమీపిస్తుండడంతో పార్టీలు అగ్రనేతలను రంగంలో దింపుతున్నాయి. సామాజిక వర్గాలవారీగా ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆయా కుల సంఘాలకు ప్రాతినిధ్యం వహించే నాయకులను గుర్తించి వారితో ఆయా పార్టీల ముఖ్య నేతలు మంతనాలు సాగిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం చివరి అంకానికి చేరుకుంది. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు భువనగిరి, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్ స్థానాల పరిధిలో జరుగుతున్న ఎన్నికలు సర్వత్రా ఆసక్తి రేకిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆయా పార్టీల అగ్రనేతలు ఈ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు. ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు 11వ తేదీ సాయంత్రంతో ప్రచారానికి తెరపడనుంది. ఇక ఎన్నికల ప్రచారానికి ఇంకా మూడు రోజులు మాత్రమే సమయం ఉండడంతో ప్రధాన పార్టీలు అగ్రనేతలను రంగంలో దింపుతున్నాయి. ఈనెల 10, 11వ తేదీల్లో రాష్ట్ర, జాతీయ నాయకులు ఆయా పార్టీల తరుపున ప్రచారం నిర్వహించనున్నారు. ప్రచారానికి చివరి రోజైన 11వ తేదీన బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పర్యటించనున్నారు. 11వ తేదీ వికారాబాద్‌లో జరిగే బీజేపీ బహిరంగసభలో, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొనున్నారు. అలాగే అదే రోజు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తాండూరులో జరిగే జనజాతర సభకు హాజరుకానున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించేందుకు ప్రధాని మోదీ కూడా 10వ తేదీన నగరానికి రానున్నారు. అదే సమయంలో శివార్లలో రోడ్డుషో నిర్వహించాలని బీజేపీ నేతలు భావించారు. అయితే సమయం ఎక్కువలేనందున హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసభకు చేవెళ్ల, మల్కాజిగిరి. భువనగిరి పార్లమెంట్ స్థానాల నుంచి కూడా జనాన్ని తరలించాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే ఇప్పటికే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ప్రధాని మోదీ రోడ్‌షో నిర్వహించారు. 11వ తేదీన వికారాబాద్‌కు అమిత్‌షా పర్యటించనున్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్లలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. బీఆర్ఎస్ ప్రచార బాధ్యతలను తీసుకున్న మాజీ మంత్రి కేటీఆర్ శివార్లలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఓటు బ్యాంకు కోసం..

ఇదిలా ఉంటే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఆర్ఎస్ ఒక వైపు బహిరంగ సభల ద్వారా ముమ్మర ప్రచార చేయడమే కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా ప్రచార వ్యూహాలను అమలు చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ తగ్గిన ప్రాంతాలపై ప్రత్యేకమైన దృష్టిసారిస్తున్నాయి. ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో పట్టున్న నేతలతో మరింత చురుకుగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టాయి. తమ పట్టు కాపాడుకునేందుకు మూడు పార్టీలు క్షేత్రస్థాయిలో హోరాహోరీగా పోరాడుతున్నాయి. రాజకీయ పార్టీలు తమ బహిరంగ సభలకు పోటీపడి భారీగా జనాలను తరలిస్తున్నాయి. ఆయా ముఖ్యనేతలు జోరుగా ప్రచారాలు, రోడ్‌షోలతో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. ఓటు బ్యాంకును పదిలపర్చుకునేందుకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అలాగే కొత్త ఓటర్లు, తటస్థ ఓటర్లు, యువత, రైతుల ఓట్లపై ఎక్కువ దృష్టిసారిస్తున్నాయి. సామాజిక వర్గాలవారీగా ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా కుల సంఘాలకు ప్రాతినిధ్యం వహించే నాయకులను గుర్తించి వారితో ఆయా పార్టీల ముఖ్యనేతల మంతనాలు సాగిస్తున్నారు.

ఇంకా చేరికలపైనే దృష్టి

ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ఆయా పార్టీలోని అసంతృప్తి నేతలను తమ వైపు తిప్పుకునేందుకు రాజకీయ పార్టీలు యత్నం చేస్తున్నాయి. అయితే ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీదేపై చేయిగా ఉంది. దాదాపు అన్ని ప్రాంతాల నుంచి ఇతర పార్టీలో ఉన్న నేతలను తమ పార్టీలో చేర్చుకుంటోంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వలసల జోరు పెంచింది. అలాగే బీజేపీలోకి కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి చేరికలు జరుగుతున్నాయి. చేరికల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎక్కువగా నష్టపోతోంది. అధికారం పోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలంతా అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీలో చేరిపోతున్నారు. దీంతో తమ వారిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ శతవిధాల ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే మూడు ప్రధాన పార్టీలు కూడా వ్యూహాత్మకంగా కొందరిని చేర్చుకోవడం లేదు. కొన్ని చోట్ల కొందరు నేతల చేరికతో అసలుకే ఎసరు వచ్చే అవకాశం ఉండడంతో ఎన్నికల తరువాత చేర్చుకుంటామని అప్పటి వరకు అక్కడే ఉండి తమకు అనుకూలంగా పనిచేయాలని కోరుతూ ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఇలా ప్రత్యర్థి పార్టీలోనే తమ వారిని ఉంచి వారితో తమకు అనుకూలంగా వ్యవహారాలు నడిపిస్తున్నాయి.



బూత్ కమిటీలపై దృష్టి

ప్రచార గడువు సమీపిస్తుండడంతో అన్ని ప్రధాన పార్టీలు పోలింగ్ బూత్ కమిటీలపై దృష్టి సారించాయి. బూత్ కమిటీలను సమాయత్తం చేసే పనిలో ప్రధాన పార్టీలు నిమగ్నమయ్యాయి. ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర చాలా కీలకమైన నేపథ్యంలో ప్రధాన పార్టీలు బూత్ కమిటీలపై దృష్టి కేంద్రీకరించారు. మిగిలిన సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు బూత్ కమిటీలను సన్నద్ధం చేస్తున్నారు. ఓటర్లతో సమన్వయంతో వ్యవహరించే బూత్ కమిటీ సభ్యుల సహకారంతో ఎక్కువ మెజార్టీ సాధించే విధంగా ప్రధాన పార్టీల ముఖ్య నేతలు సన్నద్ధమవుతున్నారు.

శ్రేణుల్లో కనిపించని జోష్ ..

అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించిన జోష్ ఈ ఎన్నికల్లో కనిపించడం లేదు. అభ్యర్థులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రచారం చేయడానికి సమయం లేకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులపైనే ఆధార పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల్లో ఎక్కువగా ఓట్లు రాబట్టేందుకు ప్రధాన పార్టీలు తమదైన శైలిలో వ్యూహరచన చేస్తున్నాయి. ఒకవైపు ఎన్నికల ప్రచారం చేస్తూనే మరోవైపు తమకున్న పరిచయాలు, పార్టీ శ్రేణుల సహకారంతో ఓటర్ల మద్దతు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రచారానికి మిగిలిన సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పార్టీల నాయకులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. తమ పరిధిలో ఓట్లు వేయించే నియోజకవర్గ నేతలతో పాటు మండల, గ్రామ స్థాయి నేతలకు ఎంతో కొంత ముట్టజెప్పి తమకు ఓట్లు పడేలా విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవైపు పార్టీల ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు ఓటర్లను ప్రభావితం చేసే వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఎవరి ధీమా వారిదే!

- మినీ ఇండియా మల్కాజిగిరిపై నజర్
- జెండా పాతేందుకు మూడు పార్టీల ప్రయత్నాలు



మేడ్చల్ మే 8(ఆంధ్ర జ్యోతి ప్రతినిధి): పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో వేగంపెంచాయి. రాజకీయ పార్టీల నేతలు బూత్‌స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ఓటర్ల చెంతకు వెళ్తున్నారు. లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రత్యేక దృష్టి సారించి ప్రచారం సాగిస్తున్న తీరు ఆసక్తిని రేకెత్తిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లకు మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఓవైపు సీనియర్ నేత ఈటల రాజేందర్, మరో వైపు సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం కావడంతో రెండు పార్టీలు ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలోని దాదాపు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సుడిగాలి ప్రచారం నిర్వహిస్తుండగా ఈటల రాజేందర్ తనదైన శైలిలో చాపకింద నీరులా ప్రచారం సాగిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా చెమటోడుస్తున్నారు. ఇప్పటికే తమ గెలుపు దాదాపు ఖాయమైందని కేవలం మెజార్టీ కోసమే కష్టపడుతున్నామని బీజేపీ నేతలు చెబుతున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తుండడంతో భారీ మెజార్టీ సాధిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారని ప్రజల నుంచి వస్తున్న స్పందనతో తమ అభ్యర్థి గెలుపొందుతాడని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇలా మూడు పార్టీల నేతలు ఎవరికి వారే మెజారిటీ ఓట్ల సాధనపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ఎంసీఎంసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన పరిశీలకులు

రంగారెడ్డి అర్బన్, మే 8 : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్, కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చాబ్రాలు బుధవారం పరిశీలించారు. ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐడీఓసీలో నెలకొల్పిన కంట్రోల్ రూంను పరిశీలించారు. 1950 టోల్ ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును గమనించారు. అబ్జర్వర్ల వెంట డీఆర్వో సంగీత, సంబంధిత అధికారులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శశాంక

ముగిసిన అదనపు ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్

రంగారెడ్డి అర్బన్, మే 8 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన అదనపు ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ బుధవారం ముగిసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, వ్యయ పరిశీలకులు రాజీవ్ చాబ్రా సమక్షంలో అదనపు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తిన ఈవీఎంల స్థానంలో అదనంగా కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు రెండో విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి తరపున ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

10 వరకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

ఈ నెల 10వరకు వీఎఫ్‌సీ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి శశాంక తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల (వీ.ఎఫ్.సి) ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈ నెల 10వ తేది వరకు గడువును పొడిగించిందని కలెక్టర్ శశాంక తెలిపారు. వాస్తవానికి బుధవారంగడువు ముగియగా, ఈసీ మరో రెండు రోజుల పాటు గడువు పొడిగించిందని చెప్పారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

16,088 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగం

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 7వ తేదీ (మంగళవారం సాయంత్రం) వరకు 16,088 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో 1,115 మంది 85 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఓట్‌ఫ్రంహోమ్‌లో భాగంగా ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 994 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్టు కలెక్టర్ శశాంక తెలిపారు.

గాలి దుమారం.. వర్ష బీభత్సం!



షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యం

400 ఎకరాల్లో పంట నష్టం

- షాద్‌నగర్ మార్కెట్‌లో తడిసిన 20వేల బస్తాల ధాన్యం
- రూ.20లక్షల వరకు రైతులకు నష్టం
- రాలిన మామిడి, బొప్పాయి
- పాల్ట్రీఫాం రేకులు ఎగిరిపోవడంతో మృత్యువాత పడిన కోళ్లు
- పలుచోట్ల నేల రాలిన మామిడి

రంగారెడ్డి అర్బన్/షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్/మంచాల/కొందుర్గు/యాచారం, మే 8: రంగారెడ్డి జిల్లాలో ఈదురుగాలుల బీభత్సానికి 9 మండలాల్లో 400 ఎకరాల్లో మామిడి, బొప్పాయి, అరటి, టమాట, వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తలకొండపల్లి, నందిగామ, చేవెళ్ల, కేశంపేట, కొందుర్గు, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, ఫరూక్‌నగర్ మండలాల్లో వరితో పాటు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. తొమ్మిది మండలాల్లో 14 ఎకరాల్లో వరి పాడైనట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఎక్కువగా మంచాల మండలంలో 70 ఎకరాల వరకు వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. షాద్‌నగర్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన 20వేల బస్తాల ధాన్యం వర్షానికి తడిసింది. కొందుర్గు మండలంలో 2 ఎకరాల్లో, ఫరూక్‌నగర్ మండలంలో 116 ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. మంచాల మండలంలో 70 ఎకరాల్లో బొప్పాయి. 25 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. పౌల్ట్రీఫాం పైకప్పు లేచిపోవడంతో కోళ్లు మృత్యువాత పడ్డాయి.

షాద్‌నగర్‌లో తడిసిన 20వేల బస్తాల ధాన్యం

వరి కోతలు ప్రారంభించిన తర్వాత షాద్‌నగర్ పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున వరి ధాన్యం వచ్చింది. ధాన్యం పచ్చిగా ఉందని, ఆరబెట్టిన తర్వాత కొనుగోలు చేస్తామని వ్యవసాయ మార్కెట్ సిబ్బంది రైతులకు సూచించారు. దీంతో రెండు, మూడు రోజుల క్రితం మార్కెట్ యార్డుకు సుమారు 50వేల బస్తాల ధాన్యం వచ్చింది. వచ్చిన ధాన్యాన్ని అక్కడే ఎండబెట్టారు. మంగళవారం రాత్రి భారీ వర్షం పడటం వల్ల మార్కెట్ యార్డులో ఎండబెట్టిన ధాన్యంతో పాటు, బస్తాల్లో ఉన్న నిల్వ ఉంచిన సుమారు 20వేల బస్తాల ధాన్యం తడిసి ముద్దయింది. కనీసం ఎండబెట్టిన ధాన్యాన్ని కప్పడానికి టార్పాలిన్ కవర్లు కూడా అందుబాటులో లేకపోవడం వల్ల ధాన్యం మొత్తం తడిసి పోయింది. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలుకు ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,203, సాధారణ రకానికి రూ. 2,183 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుంది. అయితే, తడిసిన ఏ గ్రేడ్ ధాన్యాన్ని రూ. 1,800, సాధారణ ధాన్యాన్ని రూ. 1,750 వరకు మాత్రమే కొనుగోలు చేస్తారని, దీనివల్ల తాము పెద్ద మొత్తంలో నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పెద్ద మొత్తంలో ధాన్యం మార్కెట్‌కు చేరడంతో ధాన్యాన్ని ఆరబోయడానికి స్థలం లేదని రైతులు పేర్కొన్నారు. చేవెళ్ల డివిజన్‌లో మామిడిచెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. యాచారం మండలంలోని పలు గ్రామాల్లో మామిడికాయలు రాలాయి.



మంచాల మండలం చెన్నారెడ్డిగూడలో వర్షానికి తడిసి చనిపోయిన కోళ్లు



మా బతుకులు ఇంతే..

రైతు బతుకులు ఎప్పటికీ మారవు. లాభాలు ఆశిస్తే కంటతడి తప్పడం లేదు. మార్కెట్ యార్డుకు తెచ్చిన పంటను ఏ రోజుకారోజు కొంటే మాకు ఎలాంటి నష్టమూ వచ్చేది కాదు. తడిసిన ధాన్యంతో భారీగా నష్టపోవాల్సి వస్తుంది.

- వాల్యానాయక్.. రైతు, షాద్‌నగర్



ప్రభుత్వం ఆదుకోవాలి

అకాల వర్షం వల్ల రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. తాము శ్రమించి పండించిన పంటలకు ఎప్పుడూ ఏదో ఒక సమస్య వెంటాడుతోంది. దీనివల్ల పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదు. రైతు శ్రమపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులను ఆదుకోవాలి.

- మల్లారెడ్డి, రైతు, షాద్‌నగర్



ఆరుట్లలో నేలరాలిన మామిడి కాయలు

నేలరాలిన మామిడి కాయలు, దెబ్బతిన్న బొప్పాయి పంట

కొందుర్గు మండలం పులుసుమామిడిలో ఈదురు గాలులకు 12 ఎకరాల్లోని మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతు మంగన్నగారి రామకృష్ణారెడ్డికి రూ. 3లక్షల నష్టం వాటిల్లింది. ఇదే మండలం మహదేవ్‌పూర్‌లో రెండెకరాల మామిడి కాయలు నేలరాలాయి. ముల్కాపూర్‌లోని బేగరి రామకృష్ణయ్య ఇంటి రేకులు గాలికి ఎగిరిపోయాయి. ఫరూక్‌నగర్ మండలంలో 116 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న మామిడి తోటలను బుధవారం వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి ఉషారాణి పరిశీలించారు. చౌదరిగూడ మండలంలో మామిడి, మంచాల మండలంలో బొప్పాయి, మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. మండలంలో సుమారు 70 ఎకరాల మేర బొప్పాయి, 25ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయాదికారి జ్యోతిశ్రీ తెలిపారు. చెన్నారెడ్డిగూడకు చెందిన ఎరమోని మహేష్, రత్నావత్‌స్వామి, కావలి బుగ్గరాములుకు చెందిన పౌల్ట్రీఫాం షెడ్డు రేకులు లేచి తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో వర్షం నీరు చేరి వందల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈదురు గాలుల తాకిడికి బొప్పాయి, మామిడి, పౌల్ట్రీషెడ్లు ధ్వంసమైన బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని వివిధ పార్టీల నేతలు ప్రభుత్వాన్ని కోరారు. చెన్నారెడ్డిగూడ, ఆరుట్ల గ్రామాల పరిదిలో దెబ్బతిన్న తోటలు, పౌల్ట్రీ షెడ్లను బుధవారం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం నేతలు పరిశీలించారు. వికారాబాద్ జిల్లా కులకచర్లలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన 800 బస్తాల ధాన్యం తడిసింది.

అసైన్డ్ పట్టా రైతులకు
రుణాలివ్వని బ్యాంకర్లు

- పెట్టుబడికి బంగారం కుదువపెట్టి రైతుల రుణాలు
- రుణమాఫీ వర్తిస్తుందా ? లేదా అని ఆందోళన
- తమకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్



పెద్దేముల్, మే 8 : అసైన్డ్ భూములున్న రైతులకు రెండు సంవత్సరాలుగా బ్యాంకర్లు, సొసైటీలు రుణాలు ఇవ్వడం నిలిపివేశారు. అసైన్డ్ పట్టాలకు రుణాలు ఇచ్చేది లేదని తేల్చి చెబు తున్నారు. దీంతో దిక్కుతోచని రైతులు బంగారు కుదువపెట్టి పంట రుణాలు తీసుకున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి కూడా వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసేందుకు సిద్ధమయ్యా రు. అయితే రుణమాఫీ కేవలం భూమి పట్టా పాసుపుస్తకాలు పెట్టి తీసుకున్న రుణాలకే వర్తిస్తుందా? లేక బంగారు కుదువపె ట్టి తీసుకున్న పంటరుణాలకు కూడా వర్తిస్తుందా? అనే విష యం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. అసైన్డ్ భూమి ఉన్న రైతులకు అటు సొసైటీలు, ఇటు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం నిలిపివేశారు. అసైన్డ్ పట్టాలపై రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు కలిగాయి. పంటపెట్టుబడుల కోసం చాలా మంది రైతులు బ్యాంకుల్లో బంగారు నగలు కుదువపెట్టి వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. మరి అలాంటి రైతులకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా అనే విషయం ఎవరు చెప్పలేకపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ బంగారు నగలు కుదువపెట్టి పంటరుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయలేదు. దీంతో అసైన్డ్ పట్టా రైతులు ఈ విషయమై ఆందోళన చెందుతున్నారు. అసైన్డ్ భూములకు బ్యాం కర్లు, సొసైటీల్లో రుణాలు ఇవ్వక పోవడంతో తాము బంగారు నగలు కుదువపెట్టి పంటరుణాలు తీసుకున్నామని, తమకు కూడా రుణ మాఫీ వర్తింపజేయాలని రైతులు పేర్కొంటున్నారు.

బీజేపీతో ప్రతిపక్షాల ఉనికికే ప్రమాదం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ● ఇబ్రహీంపట్నంలో రోడ్ షో



రోడ్ షోలో ప్రసంగిస్తున్న తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం, మే 8: ఈ లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆ పార్టీ ప్రతిపక్షాల ఉనికి లేకుండా చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇప్పటికే రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేస్తోందని, ప్రతిపక్ష నాయకులపై జైలుపాలు చేస్తోందని అన్నారు. భువనగిరి ఎంపీ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ని గెలిపించాలని బుధవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. బీజేపీని నిలవరించడం కమ్యూనిస్టులతో అయ్యే పనికాదనే.. సిద్ధాంతాలు వేరైనా 28పార్టీలతో కలిసి 'ఇండియా కూటమి'గా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని అన్నారు. బీసీల కులగణన జరపాలని తాము డిమాండ్ చేస్తున్నామని, ఆ లెక్క తేలితే బీసీలకు హక్కులొస్తాయన్నారు. భువనగిరిలో తప్ప మిగతా 16 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు సీపీఎం మద్దతిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఒకరిపై ఒకరు నిందలతో కాలం ఎల్లదీస్తున్నారని, దీంతో ప్రజలకు ఏం ఉపయోగం అని ప్రశించారు. ఇప్పుడు అవకాశవాద రాజకీయాల కాలం నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి సీటులో జహంగీర్‌ను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, పి.యాదయ్య, డి.జగదీశ్, జయలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కులకచర్ల, మే 8 : ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ మండలంలో ఎన్నికల నిర్వహణకు 47 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 32 పంచాయతీల్లో 36,276 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. బీఎల్‌వోల ద్వారా ఇప్పటికే ఇంటింటికీ ఓటరు స్లిప్పులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా స్లిప్పులు రాని వారు ఉంటే ఎన్నికల సిబ్బందిని అడగాలని సూచించారు. ఓటరు స్లిప్పు లేకున్నా సరే ఓటరు లిస్టులో పేరున్న వారంతా గుర్తింపు కార్డు చూపి ఓటు వేయొచ్చని తెలిపారు. ఓటున్న వారంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ధాన్యంలో తాలు లేకుండా తీసుకురావాలి



మంబాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెద్దేముల్, మే 8: రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టి వడ్లలో తాలు లేకుండా చేసి కొనుగోలు కేంద్రానికి తేవాలని డీఎస్‌వో రాజేశ్వర్ తెలిపారు. 'ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడు?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండలంలోని మంబాపూర్, జనగాం గ్రామాల్లో పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ అదే రోజు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి, తాలు లేకుండా చేసి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. మన్‌సాన్‌పల్లి రైతుల ధాన్యాన్ని అక్కడికే వెళ్లి కాంటవేసి తరలిస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని అధికారి చెప్పారు. అవసరమైన గన్నీబ్యాగులు కూడా ఉన్నాయని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



సిరిపురం పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మర్పల్లి/మోమిన్‌పేట్, మే 8: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్పల్లి మండల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల పరిసరాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144సెక్షన్ అమలు చేస్తామని తెలిపారు. ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా నాయకులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. అలాగే మోమిన్‌పేట్‌లోని పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులుండేలా చూడాలని అధికారులను సూచించారు. ఆయన వెంట మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు, మర్పల్లి, మోమిన్పేట్ ఎస్సైలు సతీశ్ అరవింద్, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

బషీరాబాద్, మే 8: నవాంద్గీ, మంతన్‌గౌడ్, బషీరాబాద్ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రాఘవులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యదర్శులతో పోలింగ్ కేంద్రాల్లోని వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వారితో మట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యాం, ఫర్నిచర్, టాయిలెట్లు, క్లీనింగ్ వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట బషీరాబాద్ జడ్పీ పాఠశాల జీహెచ్‌ఎం హీర్యానాయక్, పంచాయతీ కార్యదర్శులు జయకార్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘవులు, హెచ్ఎం

రేపటి వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పెంపు

తాండూరు, మే 8: పార్లమెంటు ఎన్నికల్లో ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ గడువును ఈ నెల 10వ తేదీ వరకు ఎన్నికల సంఘం పొడగించిందని సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు మొదట పోస్టల్ బ్యాలెట్ గడువు ఈ నెల 8వ తేదీ వరకు ఉండేదని, ఉద్యోగుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఈ నెల 10వరకు పొడగించారని తెలిపారు. తాండూరులోని ప్రభుత్వ నంబర్-1 పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోస్టల్ బ్యాలెట్‌ను ఓటు వేయొచ్చని తెలిపారు. ఇక్కడ 4 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం 1,638 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేయగా ఇప్పటి వరకు 1,334 మంది ఓటు వేశారని, ఇంకా 304 మంది ఓటు వేయాల్సి ఉందన్నారు.

ముగిసిన భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

తాండూరు, మే 8: వీరశైవ సమాజము, వీరశైవ యువదళ్, ఆంజనేయ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు కొనసాగాయి. బుధవారం చైత్ర బహుళ అమావాస్యని పురస్కరించుకుని రథంపై ఎక్కించబడిన కళశాన్ని దించటంతో ఉత్సవ సమాప్తి జరిగింది. ఈ సందర్భంగా కళశాన్ని అర్చకుల వేదమంత్రోచ్చరణల గర్భగుడి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. దాదాపు రెండు లక్షల మంది పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. జాతర మహోత్సాలను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి శాఖకు ఆలయ ఈఓ శేఖర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

సాగు, తాగునీటికి బీఆర్ఎస్ పెద్దపీట

» చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

కందుకూరు/మహేశ్వరం, మే 8 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు, తాగునీరును అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం రాత్రి కందుకూరు, మహేశ్వరం మండల కేంద్రాల్లో మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో కలిసి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. వారికి రెండు మండలాల ప్రజలు రాజకీయాలకతీతంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కేసీఆర్ తూచా తప్పకుండా అమలు చేశారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి దేవుళ్లపై ఒట్లు పెడుతున్నాడని ఆరోపించారు. తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు కాకుండా బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని సబితాఇంద్రారెడ్డి కోరారు.



వికారాబాద్ : గంగారంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ప్రత్యేక రాష్ట్రంలో కోసం ముందుండి పోరాటం చేయడంతో పాటు, పదేళ్లుగా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు, కందుకూరు మండలంలో మెడికల్ కళాశాల, మెట్రోలైన్ ఏర్పాటుకు కేసీఆర్ పెద్దపీట వేశారని తెలిపారు. చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఏఎంసీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మండలాధ్యక్షులు మన్నె జయేందర్‌ముదిరాజ్, రాజునాయక్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులున్నారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

ఎల్‌బీనగర్ : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిదు నెలల్లోనే ప్రజలకు సినిమా చూపిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం సరూర్‌నగర్‌లోని ఏఎస్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి పాల్గొన్నారు. జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాసాని మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వెయ్యాలని కోరారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని గెలుపు తథ్యం

కాసాని గెలుపు తథ్యమని ఏఎంసీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు



కందుకూరు : మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

రాజశేఖర్‌రెడ్డిలు అన్నారు. కందుకూరు మండలం కందుకూరు, మీర్కాన్‌పేట తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేయాలి

చేవెళ్ల : ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలంతో పాటు మల్కాపూర్‌లో ఇంటింటికి తిరిగి కాసానిని గెలిపించాలని ఓటర్లను కోరారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు శేరి శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు నర్సింలు, బి.నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

శంకర్‌పల్లి : కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఫత్తేపూర్, బుల్కాపూర్‌లో కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. మండలాధ్యక్షుడు గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాపారావు, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, మన్నె శ్రీకాంత్, తదితరులున్నారు.

ప్రజలను మభ్యపెట్టి కాలం గడుపుతున్న కాంగ్రెస్

ధారూరు/బంట్వారం(కోట్‌పల్లి)/దోమ/యాలాల/ మే 8 : ప్రజలను మభ్యపెడుతూ కాంగ్రెస్ కాలం గడుపుతోందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ పరిధి గంగారంలో ప్రచారంలో పాల్గొన్నారు. కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ వెంకటేష్, పట్టణాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అనంతరెడ్డి, గోపాల్, రాములు ఉన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ కార్మిక విభా గం జిల్లా అధ్యక్షుడు క్రిష్ణయ్య అన్నారు. కోట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి 150 రోజులైనా అమలు చేయడం లేదన్నారు. దోమ మండలం బొంపల్లి, అయినాపూర్‌లో ఎంపీటీసీ రాములు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వై.వెంకటయ్య, సంగయ్యయాదవ్ పాల్గొన్నారు. యాలాల మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య సంగెంకుర్దులో ప్రచారం చేశారు. మాజీ సర్పంచ్ శ్రీలత పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి కాసానిని గెలిపించాలి

పరిగి: గత పదేళ్లలో బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి కోరారు. రూప్‌ఖాన్‌పేట్, బాబాపూర్, సాలిప్పలిబాటతండాలో జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు.

ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎల్‌బీనగర్/హయత్‌నగర్/వనస్థలిపురం, మే 8 : మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి జమున సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో ప్రచారం చేశారు. పార్కులో వాకర్స్‌ను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత కోసం ప్రధాని మోదీని మరోసారి ప్రధానిగా చేయడం ఎంతో అవసరమన్నారు. రాజేందర్‌ను గెలిపించడం ద్వారా మోదీకి మద్దతు పలకాలని వాకర్స్‌ను కోరారు. కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు. ఈటలను గెలిపించాలని కోరుతూ హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో నాయకులు ప్రచారం చేశారు. ఈటలకు ఓటు వేయాలని కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి కోరారు. నాయకులు బండారి భాస్కర్, యాదగిరిగౌడ్, తదితరులున్నారు. రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహరెడ్డి మన్సూరాబాద్ డివిజన్‌లోని చిత్రసీమ కాలనీ, జడ్జెస్ కాలనీ, శుభోదయ కాలనీ, విజయశ్రీ కాలనీ, వివేకానందనగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ : దివ్యాంగుల కాలనీలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్



ఎల్‌బీనగర్ : సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో ప్రచారం చేస్తున్న ఈటల సతీమణి జమున

విద్యార్థులకు అన్నం తిన్నంత పెట్టించింది నేనే..

ఘట్‌కేసర్, మే 8 : సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులకు సన్నం బియ్యంతో వండిన అన్నం తిన్నంత పెట్టాలని, అందుకోసం నాడు ఆర్థిక మంత్రిగా చర్యలు చేపట్టింది తానేనని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో ఎన్నికల సభలో మాట్లాడారు. తాను చదుకునే రోజుల్లో హాస్టళ్లలో పురుగుల అన్నం, నీళ్లచారు ఉండేదన్నారు. తాను 1978లోనే హాస్టల్‌లో ఇచ్చిన ప్లేటు, గ్లాసుతో నగరంలోని సచివాలయం వద్ద ఆందోళన చేసినట్లు గుర్తు చేశారు. హాస్టళ్లలో ఇబ్బందులు తెలిసిన వ్యక్తిని కనుక మంత్రిగా అనేక సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా తిరిగి పోలీసుస్టేషన్లు, జైళ్లలో ఉండాల్సి వచ్చిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆరోగ్య శాఖమంత్రి అనేక కార్యక్రమాలు చేపట్టి వైద్యులు, సిబ్బందిలో ధైర్యం నింపినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐదునెలలు గడుస్తున్నా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నాడు కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేయడానికే నాలుగేళ్లు పట్టిందని మరి 2లక్షల మాఫీ ఎలాసాధ్యమని ప్రశ్నించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని కేసీఆర్ మోసం చేశాడన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మొట్టమొదట చేసేది పేదలకు ఇళ్లు కట్టివ్వడమే అన్నారు. దివ్యాంగులు మేధోసంపత్తి కలిగిన వారన్నారు. దేశాన్ని మరింత అభివృద్ధి చేసేలా బీజేపీని గెలిపించాలని కోరారు. ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సురేష్, బాలేష్, బస్వరాజ్, ఉపేందర్, నర్సింహ పాల్గొన్నారు.

నాదీ సాయం చేసే గుణం

» చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 8 : నా దగ్గర ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల దగ్గర ఉన్నంత డబ్బు లేకపోవచ్చు కానీ, అడిగిన వారికి సాయం చేసే గుణం ఉందని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి మీర్‌పేట్ కార్పొరేషన్‌లో రోడ్ షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా, తీగల ఎమ్మెల్యేగా ఉండి మీర్‌పేట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని, తనను మరోసారి గెలిపిస్తే ముున్ముందు మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఇక్కడి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



మీర్‌పేట్‌లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మహేశ్వరం/కందుకూరు :రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కోరారు. బుధవారం మహేశ్వరం మండలం అమీర్‌పేట, హర్షగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. హర్షగూడ బీఆర్ఎస్ ఎంపీటీసీ విజయ్ కాంగ్రెస్‌లో చేరారు. కేఎల్లార్, యాదయ్య, పాండునాయక్, తదితరులున్నారు. రంజిత్‌రెడ్డి గెలుపునకు సహకరించాలని పీసీసీ సభ్యులు జంగారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కందుకూరు మండలం జైత్వారం, సరాస్వతిగూడలో ప్రచారం చేశారు. దావుత్‌గూడకు చెందిన మాజీ ఉపసర్పంచ్ ధన్‌సింగ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్ : కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ అన్నారు. గౌరీ సతీష్ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ మేనేజింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయనకు రాష్ట్ర మేనేజింగ్ కమిటీ చైర్మన్ దిలీప్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కత్తి వెంకటస్వామిలు నియామకపత్రాన్ని అందజేశారు.

రంజిత్ రెడ్డిని దీవించండి : స్పీకర్

ధారూరు : నన్ను దీవించి ఆశీర్వదించినట్లే రంజిత్ రెడ్డిని కూడా దీవించి ఆశీర్వదించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ మండలం మైలార్ దేవరంపల్లిలో రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అనంతరం మైలార్ దేవరంపల్లిలో సీసీ రోడ్ల కోసం రూ.200 కోట్లు మంజూరుకై కృషి చేస్తానని తెలిపారు. మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిలున్నారు. ధారూరు, స్టేషన్ ధారూరు, కుక్కింద, గడ్డమీది గంగారం, నాగారం, కొండాపూర్ కలాన్, నర్సాపూర్, గురుదోట్ల, అంపల్లిల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగారం బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీలు పీఏసీఎస్ మాజీ చెర్మన్ జె.హన్మంత్‌రెడ్డి, స్పీకర్ సమక్షంలో పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పూడూరు/పెద్దేముల్/యాలాల : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండలం అంగడిచిట్టెంపల్లి, చిట్టెంపల్లి, పోతిరెడ్డిగూడ, మన్నెగూడ, ఎన్నెపల్లి, చీలాపూర్, గొంగుపల్లి, కొత్తపల్లి, తిమ్మాపూర్, మిర్జాపూర్, బాకాపూర్, సోమన్‌గుర్తి, కేరవెల్లి, దేవినోనిగూడ, సిరిగాయపల్లి, మేడికొండ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పెద్దేముల్ మండలం ఆడ్కిచర్ల, బాయిమీదితండా, ఊరెంటితండా, పాషాపూర్‌లో ప్రచారం చేశారు. జడ్పీటీసీ ధారాసింగ్ పాల్గొన్నారు. కోకట్ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మాణిక్యం, బాలప్ప పార్టీలో చేరారు. యాలాల మండలం అక్కంపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీ నారాయణ, జుంటుపల్లి మాజీ సర్పంచ్ నర్సిములు దాదాపు 500 మంది కార్యకర్తలు మనోహర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : తాండూరు ఎమ్మెల్యే

తాండూరు రూరల్/మోమిన్‌పేట్/ధారూరు/కులకచర్ల/పరిగి : తాండూరు మండలం సిరిగిరిపేట్, కోటబాస్పల్లి, జినుగుర్తిలో పార్టీ సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ఇన్‌చార్జి మహేష్, సంపత్‌కుమార్, కె.పురుషోత్తంరావు, మండలాధ్యక్షుడు నాగప్పలు పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మోమిన్‌పేట మండలాధ్యక్షుడు శంకర్‌యాదవ్ కోరారు. మండల కేంద్రంతో పాటు మొరంగపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్‌కు మంచి మెజార్టీ ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ వికారాబాద్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అనంతగిరిపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రచారంలో కౌన్సిలర్ దేవి రెడ్యానాయక్, మురళి, హఫీజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కులకచర్ల మండలం చెల్లాపూర్, హన్మ్యానాయక్ తండాల్లోఅఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని పరిగి మండలాధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి కోరారు. ప్రచారంలో తావుర్యానాయక్, అశోక్, బి. నర్సింహులు, పాల్గొన్నారు. మోదీ పాలనలో రైతులు, బీసీలు, మైనార్టీల పరిస్థితి ఆందోళనకరంగా తయారైందని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఫకృద్దీన్, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణ ప్రసాద్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, నాయకులు డి.అశోక్ పాల్గొన్నారు. సరూర్‌నగర్‌లో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి రంజిత్‌రెడ్డి తరపున ప్రచారం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ రంగనాయకుల కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు.

జై కాంగ్రెస్ X జై మోదీ

» రంగారెడ్డి జిల్లాలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రచారంలో ఉద్రిక్తత

» పోటాపోటీ నినాదాలు, తోపులాటతో హీట్

కేశంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రంగారెడ్డి జిల్లాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. జైకాంగ్రెస్, జైమోదీ అంటూ ఇరు పార్టీల కార్యకర్తల పోటాపోటీ నినాదాలు, తోపులాటలతో యుద్ధవాతావరణం నెలకొంది. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేముల్‌నర్వ, కేశంపేట, కొత్తపేట, అల్వాల, ఎక్లాస్‌ఖాన్‌పేటలో ప్రచారానికి పోలీసు అనుమతి తీసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి.. సంగెం, కేశంపేట, కొండారెడ్డిపల్లిలో ప్రచారం చేసుకునేందుకు అనుమతి పొందారు. అయితే, కాంగ్రెస్ శ్రేణులు కేశంపేటలో ప్రచారం ముగించుకుని మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొండారెడ్డిపల్లికి వెళ్తుండగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు వారికి ఎదురుపడ్డారు. జైకాంగ్రెస్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు, జైశ్రీరామ్, జైమోదీ అంటూ బీజేపీ శ్రేణులు పోటాపోటీ నినాదాలు చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట మొదలైంది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో అక్కడే ఉన్న కేశంపేట ఎస్సై లింగం ఇరుపార్టీల నాయకులను సముదాయించారు. వంశీచంద్ రెడ్డి కాన్వాయ్‌ని ముందుకు పంపించారు. ఆ తర్వాత డీకే అరుణ ప్రచారం కొనసాగించారు. అనంతరం ఘటనా స్థలికి చేరుకున్న ఏసీపీ రంగస్వామి.. ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా చేసుకోవాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు.



బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



ఉత్తర భారతీయులతో మేడ్చల్‌లో సమావేశమైన రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ

మేడ్చల్‌లో పర్యటించిన రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ

మేడ్చల్ టౌన్, మే 8: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర భారతీయుల ఓటర్లను ఆకట్టుకోవటానికి రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ నియోజక వర్గంలోని ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన మార్వాడీ వ్యాపారస్తులతో పాటు, ఉద్యోగాల కోసం వచ్చి స్థిరపడ్డ ఉత్త భారతీయ కుటుంబాలను కలిసి వారి ఓటును బీజేపీకి వేయాలని అభ్యర్థించారు. వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మీడియాకు సమాచారం లేకుండా ఈ సమావేశాన్ని బీజేపీ నేతలు నిర్వహించారు. సమావేశం నిర్వహిస్తున్న కల్యాణ మండపం వద్ద పోలీసులు ఉత్తర భారతీయులు తప్పా, మిగతా వారు రాకుండా భారీ బందోవస్తును ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఏర్పాట్లను మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజక వర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి చేపట్టారు. స్థానిక బీజేపీ నేతలను సైతం సమావేశానికి అనుమతించలేదు.

కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తాం

తాండూరు రూరల్/యాలాల/మోమిన్‌పేట్/ధారూరు/కులకచర్ల/ మే 8 : మాదిగలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బుధవారం తాండూరు మండలం కొత్లాపూర్, సంగెంకలాన్, మల్కాపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ ఆధ్వర్యంలో బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కమలం పువ్వుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీజేపీతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధ్యం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు జగదీష్, ప్రవీణ్, రవి, ప్రకాష్, వెంకటప్ప పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం బీజేపీకి ఓటు వేయాలని ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి దప్పు మహేందర్, ఎమ్మార్పీఎస్ యాలాల మండల అధ్యక్షుడు మెట్లు సూర్యప్రకాశ్ కోరారు. రాస్నం, పగిడియాల్, అచ్యుతాపూర్, ముద్దాయిపేట్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ వికారాబాద్ జిల్లా కోకన్వీనర్ అజయ్‌ప్రసాద్, జానీ పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోనే సాధ్యమని మహాజన సోషలిస్టు పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ అన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మోమిన్‌పేట్ మండలం రామ్‌నాథ్‌గూడుపల్లి, మల్‌రెడ్డిగూడా, గోవిందపూర్, టేకులపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నర్సింహ, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు. ధారూరు మండలం నాగారం, నాగసమందర్, ధారూరు, కేరెల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. డమ్మీ ఈవీఎంలు చూపుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు ఉన్న చోట బటన్ నొక్కాలని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, అనిల్ గౌడ్, మణికంఠరెడ్డి పాల్గొన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా కులకచర్ల బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, నాయకులు జానకిరామ్, మైపాల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్లాపూర్‌లో ఎన్నికల ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

చేవెళ్ల/మహేశ్వరం/కందుకూరు కేంద్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే అని మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. చేవెళ్ల మండలం దేవరంపల్లి, షాబాద్ మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కార్యకర్తలు చేవెళ్ల పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. బీజేపీ పథకాలకు ఆకర్షితులై భారీగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో చేవెళ్ల మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కృష్ణాగౌడ్, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సామ మాణిక్యరెడ్డి, ఎం.రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, దేవుని శర్వల్వింగం, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కాగా నేడు చేవెళ్లలో సాయంత్రం 5గంటలకు ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రోడ్డు షో ఉంటుందన్నారు. చేవెళ్ల మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, బూత్ కమిటీ సభ్యులు భారీగా తరలివచ్చి రోడ్డును విజయవంతం చేయాలని కోరారు. నరేంద్రమోడితోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యం అని, ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చలక్ష్మణ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో ప్రచారం నిర్వహించారు.

ప్రజా సంక్షేమానికిబీజేపీ ప్రభుత్వం కృషి

కందుకూరు: ప్రజాసంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తుందని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో లేమూరు ఎంపీటీసీ యాదయ్య, కొందరు బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతీ హిందువు ఓట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, మల్లారెడ్డి, పాండు, బాల్‌రాజ్, రవీందర్, వెంకటేష్, మైసయ్య, రవీందర్ పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీ ఆలయ పరిసరాల్లో ఓట్లు అభ్యర్థిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

చిలుకూరులో విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి ప్రచారం

మొయినాబాద్ రూరల్: చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో చేవెళ్ల గడ్డపై కాషాయ జెండాను ఎగరేస్తామని కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చిలుకూరు ఆలయంలో పూజలు చేసి గ్రామంలో ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. భక్తులను సైతం ఆమె మద్దతు కోరారు. ఆమె వెంట సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సహదేవ్‌గౌడ్, శ్రీరాములు, మల్లారెడ్డి, దర్గా మహేందర్, రాజమల్లేష్, విక్రమ్‌రెడ్డి, రమేష్‌చారి, మహేందర్, కిషన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆమనగల్లు : మాట్లాడుతున్న చిత్తరంజన్ దాస్

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

ఆమనగల్లు/కడ్తాల్, మే 8 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్‌దాస్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు జగన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వస్పుల మానయ్యల అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి చిత్తరంజన్, గద్దర్ కూతురు వెన్నెల, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, వైస్ ఎంపీపీ అనంతరెడ్డిలు హాజరయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పోలింగ్‌బూత్‌ల వారీగా పార్టీ పరిస్థితిపై చర్చించారు. మల్లు రవిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులున్నారు. ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ తుడుచుకు పెట్టుకుపోతుందని గ్రహించిన కేసీఆర్ బస్సుయాత్ర పేరుతో సాగిస్తున్న రాజకీయ ఎత్తుగడలు ప్రజలు తిప్పికొట్టక తప్పదని గద్దర్ కూతురు వెన్నెల అన్నారు. సింగంపల్లిలో మండల, మున్సిపల్ అధ్యక్షులు జగన్, మానయ్యల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మల్లు రవిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో నాయకులు మల్లు రవిని గెలిపించాలని ప్రచారం చేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తదితరులున్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం


గూడూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తూర్, మే 8 : బీఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ జరుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గూడూర్, మక్తగూడ, ఇన్ముల్‌నర్వ గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మన్నె శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెంటనోళ్ల యాదగిరి, మెండె కృష్ణ, సత్తయ్య, వాజిద్, సదానంద్, సురేష్ తదితరులున్నారు.

కళాకారులకు చేయూతనివ్వాలి


విరాళం అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి, మే 8: కవులు, కళాకారులకు ప్రతీ ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొంపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గ్రామీణ కళలకు జీవం పోసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఇటీవల సీతారామాంజనేయ కళానాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించిన కళాకారులకు బుధవారం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూలమాలలు, శాలువాలతో వారిని సత్కరించారు. కళాకారులకు ప్రోత్సాహకంగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. దామోదర్ రెడ్డి, మొక్తాల జంగయ్య, శేఖర్‌యాదవ్, యాదయ్య, రాములు, రాఘవాచారి, చెన్నయ్య, మల్లేశ్, గణేశ్, లక్ష్మీకాంత్, నరేశ్, తదితరులున్నారు.

ప్రభుత్వ భూములపై కన్నేసిన కాంగ్రెస్


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 8: ఐదు నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రంగేంటో తేలిపోయిందని ఇది ఎక్కువ కాలం మనుగడ సాగించే పరిస్థితి లేదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అలవిగాని హామీలు, మోసపు మాటలతో గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం ప్రభుత్వ భూములపై కన్నేసిందంటూ ఆరోపించారు. భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపును కాంక్షిస్తూ బుధవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన రోడ్‌షో, చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి అనేది బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. భువనగిరి స్థానంలో మల్లేష్‌ను మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించుకుందామంటూ ప్రజలను కోరారు. మల్లేష్ మాట్లాడుతూ బలహీనవర్గాలకు చెందిన నాయకుడిగా కేసీఆర్ తనకు ఇక్కడ అవకాశం ఇచ్చారని, తనను దీవించి పార్లమెంటుకు పంపితే ఎల్లవేళలా మీ సేవలో ఉంటానని అన్నారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

చౌదరిగూడ, మే 8: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని టీఏ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు చౌదరిగూడ మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు ఓటుహక్కు వినియోగంపై స్వీప్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు వజ్రాయుధం లాంటిందని, ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలన్నారు. మీతో పాటు చుట్టుపక్కల ఉన్న వారు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. నిష్పక్షపాతంగా ఓటు వేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.


చౌదరిగూడలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న టీఏ లక్ష్మారెడ్డి

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


మామిడి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, మే 8: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు నేలరాలిన మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని తెలిపారు. పంటల నష్టం అంచనావేసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. రైతులు అధైర్యపడొద్దని ఆయన కోరారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

తలకొండపల్లి, మే 8: జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అనారోగ్యంతో బాధపడుతున్న కటికె రామచంద్రయ్యకు చేయూతనందించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కటికె రామచంద్రయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైద్య ఖర్చులకు రూ.50 వేలు కేటాయించగా బుధవారం ట్రస్ట్ సభ్యులు అందజేశారు. నాయకులు తెల్గమల్ల వంశీ, కేతావత్ సాయి, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

బీటలు వారుతున్న బీఆర్ఎస్ కంచుకోట!

- శంషాబాద్ నుంచి కాంగ్రెస్‌లోకి ఆరుగురు కౌన్సిలర్లు
- కండువాలు కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి


రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న కౌన్సిలర్లు

శంషాబాద్, మే 8 : ఇన్నాళ్లు బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీలో ఆ పార్టీ ప్రస్తుతం బీటలు వారుతోంది. శంషాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో, కార్నర్‌మీటింగ్ సందర్భంగా ఈనెల 5న మున్సిపాలిటీలోని 15వ వార్డుకు చెందిన అమృతా సుధాకర్‌రెడ్డి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా, చేవెళ్ల నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాతంరాయి 2వార్డు కౌన్సిలర్ అంగోతు భద్రునాయక్, 13వ వార్డుకు చెందిన భాగ్యలక్ష్మీ శ్రీకాంత్ యాదవ్, 5 వార్డుకు చెందిన మత్రత్‌తాజ్‌బాబా, 23వ వార్డు కౌన్సిలర్ స్రవంతి శ్రీకాంత్‌రెడ్డి, 22వ వార్డుకు చెందిన శ్రీకాంత్‌యాదవ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు నగరంలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో పార్టీలో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. మొత్తం 25 స్థానాలు ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. గత పదేళ్లపాటు కంచుకోటగా ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం బీటలు వారుతోంది. పార్టీ మారిన ఆరుగురు కౌన్సిలర్లు తమ తమ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. మరికొందరు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో టచ్‌లో ఉన్నారని సమాచారం. త్వరలో మరికొందరు కాంగ్రెస్‌లో చేరుతారని జోరుగా ప్రచారం సాగుతోంది.

ఆర్ఎస్పీని గెలిపించాలి


ప్రచారం చేస్తున్న సీఎల్ శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి/కడ్తాల్, మే 8 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఉన్నత విద్యావంతుడైన ప్రవీణ్ కుమార్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో అణగారిన వర్గాల ప్రజల గొంతుకగా నిలుస్తారని అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో బుధవారం ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను మోసగించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, నాయకులు నరేందర్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్, యాదయ్య, శ్రీరామ్, బుచ్చయ్య, సుధాకర్, అభిలాష్ గౌడ్, శ్రీశైలం, తదితరులున్నారు. కడ్తాల మండలం గాన్కుమర్ల తండాలో జడ్పీటీసీ దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్ సేవ్యనాయక్, నాయకులు పాండు, శ్రీను, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చామల కిరణ్‌ను గెలిపించాలి

యాచారం, మే 8 : భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం ఆయన భార్య డింపుల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సతీమణి స్నేహరెడ్డిలు నందివనపర్తి, అయ్యవారిగూడ, ఏనెకింది తండాలో ఓటర్లను అభ్యర్థించారు. మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు తిరుమలేష్, బట్టు శ్రీనివాస్, లింగం. చంటి తదితరులు పాల్గొన్నారు.


నందివనపర్తిలో ప్రచారం చేస్తున్న డింపుల్‌రెడ్డి, స్నేహరెడ్డి నాయకులు

రక్తదానంపై అపోహలు వీడాలి : సీఐ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు, మే 8 : రక్తదానం అభినందనీయమని, మరొకరి ప్రాణాలు కాపాడటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్ అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి ప్రాణిని కాపాడడానికి యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్ ఉన్నత పాఠశాలలో బుధవారం మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎద్మ మాధవ రెడ్డి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము మై విలేజ్ మోడల్ విలేజ్ అధ్యక్షుడు మంగ బాల్‌రాజ్ గౌడ్, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్‌లతో కలిసి సీఐ ప్రమోద్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 120 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. సీఐ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పోటీ పడాలని ఆయన సూచించారు. సంఘం బ్లడ్‌బ్యాంక్ నిర్వాహణలో మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని సీఐ అన్నారు. నిర్వాహకుడు దార్ల చిత్తరంజన్ దాస్, శృతిలయ కల్చరల్ అకాడమీ కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు నాగిళ్ల జగన్, పాష, నిరంజన్‌గౌడ్, దారెడ్డి అభినవ్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీరామ్, సంతోష, నాగార్జున, రవికాంత్, జంగయ్య, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి


సుజాతను సన్మానిస్తున్న నాయకులు

షాబాద్, మే 8 : ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి కల్వ సుజాతను ఛైర్మన్‌గా నియమించడంతో షాద్‌నగర్‌లో షాబాద్ ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యుల చిరకాల కోరిక వైశ్య కార్పొరేషన్‌తో నెరవేరిందన్నారు. ఆర్యవైశ్యుల్లో ధనవంతులే కాదు, పేదలు కూడా ఉన్నారని, కార్పొరేషన్‌తో అందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటుచేసి కీలక ప్రకటన చేయడం హర్షనీయమన్నారు. సంఘం నాయకులు వీరయ్యగుప్తా, వీరేష్ గుప్తా, విద్యాసాగర్‌గుప్తా, పూర్ణచందర్‌గుప్తా, రాము గుప్తా, రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సింహ వర్ధంతి

ఇబ్రహీంపట్నం, మే 8: సీపీఎం సీనియర్ నాయకుడు బద్దు నర్సింహ వర్ధంతిని ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి నివాళ్లర్పించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, నాయకులున్నారు.

ముదిరాజుల హక్కుల సాధనకు ఉద్యమిస్తా


షాద్‌నగర్‌అర్బన్ : మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, మే 8: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, తనను లోక్ సభకు పంపిస్తే ముదిరాజ్‌ల అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఉద్యమిస్తానని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ వంశీచంద్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ ముదిరాజ్ సభ అధ్యక్షుడు ఆంచ రాములు అధ్యక్షతన బుధవారం తాలుకా స్థాయి ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వంశీచంద్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల్లో అత్యధిక జనాభా కల్గిన ముదిరాజ్‌లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుని, వదిలేసిందన్నారు. గ్రూప్ డిలో ఉన్న ముదిరాజ్‌లను గ్రూపు ఏలో చేర్చాలని పోరాటాలు చేసినా పట్టించుకోలేదన్నారు. ముదిరాజ్‌ల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మొసలికన్నీరు కారుస్తూ, మరోసారి మోసం చేయడానికి మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనతో మహబూబ్‌నగర్ లోక్‌సభకు పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చిన ముదిరాజ్‌లు కేంద్రంలో సైతం అధికారం పొందడానికి ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు చెన్నయ్య, ప్రభాకర్, కావలి యాదయ్య, సూర్యప్రకాష్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేయాలి

కేశంపేట : బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని వంశీచంద్ పిలుపునిచ్చారు. కేశంపేట మండలం సంగెం, కేశంపేట, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. సంతాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, ఇబ్రహీం, తదితరులున్నారు.

అండగా నిలిచిన కాంగ్రెస్‌ను ఆదరించండి

షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్/కొందుర్గు : కార్పొరేషన్‌ను ఇచ్చి రెడ్డిలకు అండగా నిలిచిన కాంగ్రెస్‌ను ఆదరించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కోరారు. షాద్‌నగర్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కె.మధన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రెడ్డి భవన్‌లో నిర్వహించిన రెడ్డి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రెడ్డి కార్పొరేషన్ కోసం పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు కొత్తూర్ మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్, అక్కవానిగూడతో మండల పరిధిలోని తీగాపూర్‌లో ప్రచారం చేశారు. జె.సుదర్శన్‌గడ్, హరినాథ్‌రెడ్డి, శ్రీను, విజయ్‌పాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వంశీచంద్‌ను గెలిపించాలని కొందుర్గు మండల కేంద్రంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. చెర్కుపల్లి, తంగళ్లపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. జిబి కృష్ణయ్య, బి.నర్సింలు, సి.కృష్ణయ్య, కె.దశరథం, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతుల రద్దుకై ముద్విన్ గ్రామస్థుల పోరుబాట

- ఉన్నతాధికారులకు వినతి
- ఎన్నికలు బహిష్కరిస్తామని ప్రకటన

కడ్తాల్, మే 8 : మైనింగ్ అనుమతుల రద్దు కోసం ముద్విన్ గ్రామస్థులు పోరుబాట పట్టారు. రాజకీయాలకతీతంగా గ్రామస్థులంతా ఏకమయ్యారు. అఖిల పక్షం ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతున్నారు. తమ అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుంటే ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్థులు ప్రకటించారు. ముద్విన్ సమీపంలోని సర్వేనంబర్ 95లో నల్లగుట్ట వందల ఎకరాల్లో విస్తరించి ఉంది. నల్లగుట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో మైనింగ్ కంపెనీ ఏర్పాటుకు రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన రెండు కంపెనీల నిర్వాహకులు భూమి కేటాయింపుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా 13 ఎకరాల భూమిని వారికి కేటాయించారు. అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కూడా కలిసి వినతిపత్రాలు అందజేశారు. గ్రామస్థుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా మైనింగ్‌కు అనుమతులిచ్చారు. దాంతో గ్రామస్థులంతా ఏకమై మైనింగ్ అనుమతుల రద్దుకు పోరాటానికి శ్రీకారం చుట్టారు. బుధవారం కలెక్టర్ శశాంక, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్‌లను ముద్విన్ అఖిల పక్షం నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. వ్యవసాయం దెబ్బతింటుందని, వన్యప్రాణుల, పాడిఆవుల మనుగడకు కూడ ప్రమాదమని, బోర్లు, చెరువు కుంటలు దెబ్బతింటాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కడ్తాల ఆర్ఐ వాహిద్ అధికారుల ఆదేశానుసారం బుధవారం నల్లగుట్టను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం.

సీపీఎంకు ఒక్కసారి అవకాశమివ్వండి


ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న జహంగీర్

ఇబ్రహీంపట్నం, మే 8: నిరంతరం ప్రజా సమస్యలపై పోరుసల్పుతూ సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తున్న సీపీఎంను ఈ పార్లమెంటు ఎన్నికల్లో బలపరచాలని భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ కోరారు. బుధవారం నాగన్‌పల్లి, పోల్కంపల్లి, నెర్రెపల్లి, దండుమైలారం, ముకునూరు, రాయపోల్‌లో ప్రచారం చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గంలో సాగునీటి సమస్యపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు మాట్లాడడం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, బస్వాపూర్ రిజర్వాయర్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. గతం నుంచి అనేక ఉద్యమాలను నెరపిన ఈ గడ్డపై సీపీఎంకు ఒక్కసారి అవకాశమివ్వాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలో పదేళ్ల మోదీ ప్రభుత్వంలో ధరలు విపరీతంగా పెరిగాయన్నారు.

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, మే 8 : శంషాబాద్ మండలంలోని గొల్లపల్లికి చెందిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. గొల్లపల్లి గ్రామానికి చెందిన సంపంగి ప్రవీణ్, మాధవిలు దంపతులు. మంగళవారం రాత్రి ఇంట్లో ప్రవీణ్, మాధవి వారి పిల్లలతో కలిసి నిద్రించారు. బుధవారం తెల్లవారుజామున 3.40 నిమిషాలకు పెద్ద కుమారుడు యశ్వంత్‌కు మెళకువ వచ్చింది. అతడు తన తల్లి తన పక్కన లేకపోవడంతో తండ్రికి చెప్పాడు. వెంటనే ప్రవీణ్ చుట్టుపక్కల, బంధువులకు సమాచారం చేరవేసినా ఫలితం లేకపోయింది. కాగా, ఆమె ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో బ్లూకలర్ దుస్తులు ధరించి ఉందని, తెలుగులో మాట్లాడుతుందని, ఎత్తు ఐదు అడుగులు ఉంటుందని భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ పోలీసులు చెప్పారు.

రూ.6 లక్షల విలువైన సిగరెట్లు అపహరణ

ఆమనగల్లు, మే 8 : పట్టణంలోని జాతీయ రహదారిపై గల క్రాంతి కుమార్ ఏజెన్సీ స్టోర్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ.6లక్షల విలువ చేసే వివిధ కంపెనీల సిగరెట్లను అపహరించుకుపోయారు. దుకాణ నిర్వాహకుడు సామల క్రాంతి కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లు పట్టణంలోని ఏపీజీవీబీ సమీపంలో గల స్టోర్‌లో పెద్దఎత్తున హోల్‌సేల్ విక్రయాలు సాగిస్తారు. సిగరెట్లు, ఇతర వస్తువులు నిల్వ ఉంటాయి. దుకాణం ఎదుట సీసీ కెమెరాలు కూడా లేవు. ఇదే అదనుగా భావించిన దొంగలు బుధవారం తెల్లవారుజామున దుకాణం షెట్టర్‌ను ధ్వంసం చేసి దుకాణం లోపలికి ప్రవేశించారు. అందులో నిల్వ ఉన్న వివిధ రకాల కంపెనీలకు చెందిన సిగరెట్లు మాత్రమే చోరీ చేశారు. యజమాని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీఎస్ పోలీసులు, క్లూస్‌టీం, ఫోరెన్సిక్ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

లారీ-కారు ఢీ.. ఒకరు దుర్మరణం

కందుకూరు, మే 8 : లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో భర్త అక్కడే మృతిచెందగా భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మలక్‌పేట ప్రాంతానికి చెందిన చింతలపాటి దుర్గా ప్రసాద్(65) భార్య నాగనిశ్చల(58)లు కారులో కందుకూరు నుంచి హైదరాబాద్ వైపు బుధవారం సాయంత్రం వెళుతుండగా మండలంలోని కొత్తూరు వాగు సమీపంలో హైదరాబాద్ నుంచి వస్తున్న లారీని కారు బలంగా ఢీకొంది. కారులో ఉన్న దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా నాగనిశ్చలకు తీవ్ర గాయాలయ్యాయి. కందుకూరు ఎస్సై సైదులు కేసు నమోదు చేసుకొని తీవ్రగాయాలైన నాగనిశ్చలను నగరంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

స్వాగత తోరణం కిందపడి మహిళ మృతి

మొయినాబాద్ రూరల్, మే 8: జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణం తీవ్ర గాలులు, వర్షం కారణంగా కిందపడటంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మొయినాబాద్ సీఐ పవన్‌కుమర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నమంగళారంలో మూడు రోజులుగా బీరప్ప బోనాలు వేడుకలు జరుగుతున్నాయి. నిర్వాహకులు గ్రామ పరిధి ప్రారంభంలో స్వాగత తోరణాలను(బోర్డులను) ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షం, ఈదులు గాలులతో స్వాగత బోర్డు కింద పడిపోయింది. అదే సమయంలో కూరగాయలు కొనుగోలు చేయడానికి వెళ్లిన జహీరాబేగం(47)పై బోర్డు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె భర్త మహ్మద్ ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

మొయినాబాద్ రూరల్, మే 8 : విద్యుత్ తీగలు తగిలి గేదె మృతిచెందిన ఘటన పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. బాధితుడు రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన తలారి రామకృష్ణకు ఒక గేదె ఉంది. బుధవారం గ్రామ పరిసరాల్లో మేతకు వెళ్లిన సమయంలో విద్యుత్ తీగలు తగిలి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

అద్దంకి దయాకర్‌పై పోలీసులకు ఫిర్యాదు

శంకర్‌పల్లి, మే 8 : కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్‌పై బుధవారం మోకిల పోలీసుస్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎస్సై కోటేశ్వరరావుకు ఫిర్యాదు అందజేసి అద్దంకి దయాకర్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. శ్రీరాముడు, సీతాదేవిలపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినవారిలో వెంకటేశం, హరినాథ్, రాజాచంద్ర, యాదయ్య, లింగం, కరుణాకర్‌చారి, కృష్ణ తదితరులు ఉన్నారు.

మరోసారి మోదీని గెలిపించాలి

- షాద్‌నగర్ రోడ్‌షోలో బీజేపీ ఎంపీ, సినీ నటి నవనీత్‌కౌర్


మాట్లాడుతున్న ఎంపీ నవనీత్ కౌర్

షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్/కేశంపేట, మే 8: దేశం కోసం, దేశ ప్రజల కోసం పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి కూడా ప్రధాని కావడం కోసం బీజేపీకి ఓటు వేసి, డీకే అరుణమ్మను గెలిపించాలని సినీనటి, బీజేపీ ఎంపీ నవనీత్‌కౌర్ అన్నారు. దేశ భద్రత, అభివృద్ధి, సంక్షేమం కోసం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేస్తే పాకిస్థాన్‌ను సమర్థించినట్టే అవుతుందన్నారు. షాద్‌నగర్ కేంద్రంలో బుధవారం రాత్రి బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆధ్వర్యంలో ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. నవనీత్‌కౌర్ హాజరై ప్రసంగించారు. 2014కు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావాలని పాకిస్థాన్ కోరుతున్నదన్నారు. రాహుల్ గాంధీ గెలవాలని, ప్రధాని కావాలని పాకిస్థాన్ నుంచి ప్రేమ పూర్వక సందేశాలు వస్తున్నాయన్నారు. దాయాది దేశాలను ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు ఓటు వేయడం అవసరమా? అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళ అయిన డీకే అరుణను అవహేళన చేస్తూ మాట్లాడడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఉండాలని, దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్న బీజేపీకి ఓటు వేయాలని నవనీత్‌కౌర్ కోరారు. డీకే అరుణ మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేసి, తనను గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులున్నారు. రేవంత్‌రెడ్డికి నా ముందు నిలబడి సవాళ్లు ఎదుర్కొనేందుకు ధైర్యం ఉందా అని డీకే అరుణ సవాలు విసిరారు. కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వలో రోడ్‌షోతో పాటు మున్సిపాలిటీ కొత్తూర్, తిమ్మాపూర్‌లలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆమె మాట్లాడారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. దేశానికి మోదీ గ్యారెంటీ అని, మరోసారి ఆయన ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఎంపీగా తనను గెలిపిస్తే పాలమూరుకు డీకే అరుణమ్మ గ్యారెంటీగా ఉంటుందని అరుణ అన్నారు. కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కేశంపేట, కొత్తపేట, అల్వాల, ఎక్లాస్‌ఖాన్‌పేటలలో ప్రచారం నిర్వహించారు. అలాగే మంగళగూడకు చెందిన కొట్టం సుధాకర్‌రెడ్డి అనుచరులతో కలిసి అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీవర్ధన్ రెడ్డి, బాబయ్య, మండలాధ్యక్షుడు రాఘురాములు, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా సేవలందిస్తున్న మోదీకి మద్దతు ఇవ్వండి


కూలీలతో మాట్లాడుతున్న కొప్పు బాషా

యాచారం, మే 8 : నీతి, నిజాయితీగా దేశ ప్రజలకు సేవలందిస్తున్న ప్రధాని మోదీకి మద్దతు ఇచ్చి ప్రధానిని చేయాలని, అందుకోసం భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, యాచారం ఎంపీపీ సుకన్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఉపాధి కూలీలను కలిసి బూరనర్సయ్య గౌడ్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.